03-10-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - గృహస్థ వ్యవహారంలో ఉంటూ అందరితో సంబంధాన్ని నిర్వర్తించాలి, ఎవ్వరినీ ద్వేషించకూడదు, కానీ కమలపుష్ప సమానంగా పవిత్రంగా తప్పకుండా అవ్వాలి"

ప్రశ్న:- మీ విజయ ఢంకా ఎప్పుడు మ్రోగుతుంది? వాహ్-వాహ్ అనేది ఎలా వెలువడుతుంది?

జవాబు:- అంతిమ సమయంలో ఎప్పుడైతే పిల్లలైన మీపై మాయా గ్రహచారము కూర్చోవడము సమాప్తమైపోతుందో, సదా లైన్ క్లియర్ గా ఉంటుందో అప్పుడు వాహ్-వాహ్ అనేది వెలువడుతుంది, విజయ ఢంకా మ్రోగుతుంది. ఇప్పుడైతే పిల్లలపై గ్రహచారము కూర్చుంటూ ఉంటుంది, విఘ్నాలు కలుగుతూ ఉంటాయి. మూడు అడుగుల భూమి కూడా సేవ కొరకు కష్టం మీద లభిస్తుంది, కానీ పిల్లలైన మీరు మొత్తం విశ్వానికి యజమానులుగా అయ్యే సమయం కూడా వస్తుంది.

పాట:- ఓర్పు వహించు మానవా... (ధీరజ్ ధర్ మనువా...)

ఓం శాంతి. ఇప్పుడు పాత నాటకం పూర్తయిందని పిల్లలకు నంబరువారు పురుషార్థానుసారంగా తెలుసు. దుఃఖపు రోజులు ఇంకా కొన్ని ఘడియలు మాత్రమే ఉన్నాయి, ఆ తర్వాత ఇక సదా సుఖమే సుఖము ఉంటుంది. ఎప్పుడైతే సుఖం గురించి తెలుస్తుందో అప్పుడు ఇది దుఃఖధామము అని, అపారమైన వ్యత్యాసము ఉంది అని అర్థం చేసుకుంటారు. ఇప్పుడు సుఖము కొరకు మీరు పురుషార్థం చేస్తున్నారు. ఈ దుఃఖము యొక్క పాత నాటకము పూర్తయిందని అర్థం చేసుకున్నారు. సుఖము కొరకు ఇప్పుడు బాప్ దాదా యొక్క శ్రీమతంపై నడుస్తున్నారు. ఎవరికైనా అర్థం చేయించడం చాలా సహజము. ఇప్పుడు బాబా వద్దకు వెళ్ళాలి. బాబా తీసుకువెళ్ళడానికి వచ్చారు. గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమలపుష్ప సమానంగా పవిత్రంగా అయ్యి ఉండాలి. సంబంధాలను తప్పనిసరిగా నిర్వర్తించాలి. ఒకవేళ సంబంధాలను నిర్వర్తించకపోతే సన్యాసుల వలె అయినట్లు. వారు సంబంధాలను నిర్వర్తించరు కావున వారిది నివృత్తి మార్గము, హఠయోగము అని అంటారు. సన్యాసుల ద్వారా ఏదైతే నేర్పించబడుతుందో అది హఠయోగము. మనము భగవంతుడు నేర్పించే రాజయోగాన్ని నేర్చుకుంటాము. భారత్ యొక్క ధర్మశాస్త్రము గీత. ఇతరుల ధర్మశాస్త్రాలు ఏంటి, వాటితో మనకే సంబంధము లేదు. మీరు ఇప్పుడు గృహస్థ వ్యవహారంలో ఉంటూ ఒకసారి సన్యాసము చేస్తారు, ఆ తర్వాత 21 జన్మలు దాని ప్రారబ్ధాన్ని పొందుతారు. వారిది హద్దు సన్యాసము మరియు హఠయోగము, మీది అనంతమైన సన్యాసము మరియు రాజయోగము. వారైతే గృహస్థ వ్యవహారాన్ని వదిలేస్తారు. రాజయోగానికైతే ఎంతో మహిమ ఉంది. భగవంతుడే రాజయోగాన్ని నేర్పించారు, కావున భగవంతుడు అని తప్పకుండా ఉన్నతోన్నతమైన వారినే అంటారు. శ్రీకృష్ణుడైతే భగవంతుడు కాలేరు. ఆ నిరాకారుడే అనంతమైన తండ్రి. అనంతమైన రాజ్యాధికారాన్ని వారే ఇవ్వగలరు. ఇక్కడ గృహస్థ వ్యవహారాన్ని ద్వేషించడం జరగదు. తండ్రి అంటారు, ఈ అంతిమ జన్మలో గృహస్థ వ్యవహారంలో ఉంటూ పవిత్రంగా అవ్వండి. పతిత-పావనుడు అని ఏ సన్యాసినీ అనడం జరగదు. పతిత-పావనా అని సన్యాసులు స్వయం కూడా గానం చేస్తారు, వారిని తలచుకుంటారు, వారు కూడా పావన ప్రపంచాన్ని కోరుకుంటారు. కానీ ఆ ప్రపంచమే వేరు అని వారికి తెలియదు. వారు గృహస్థ వ్యవహారంలోనే లేనప్పుడు ఇక దేవతలను కూడా అంగీకరించరు. వారు ఎప్పుడూ రాజయోగాన్ని నేర్పించలేరు. తండ్రి ఎప్పుడూ హఠయోగాన్ని నేర్పించలేరు, అలాగే సన్యాసులు ఎప్పుడూ రాజయోగాన్ని నేర్పించలేరు. ఇది అర్థం చేసుకోవలసిన విషయం.

ఇప్పుడు ఢిల్లీలో వరల్డ్ కాన్ఫరెన్స్ జరుగుతుంది, వారికి అర్థం చేయించాలి, అందరికీ వ్రాసి ఇవ్వాలి. అక్కడైతే అభిప్రాయ-భేదాలు ఉంటాయి. వ్రాసి ఇచ్చినట్లయితే వీరి ఉద్దేశ్యమేమిటి అన్నది అందరూ అర్థం చేసుకుంటారు. మేము బ్రాహ్మణ కులానికి చెందినవారము, మేము శూద్ర కులం యొక్క సభ్యులుగా ఎలా అవ్వగలము లేక వికారీ కులంలో మేము స్వయాన్ని ఎలా రిజిస్టర్ చేసుకోగలము - అని మీరు ఇప్పుడు అర్థం చేసుకున్నారు, అందుకే తిరస్కరిస్తారు. మనం ఆస్తికులము, వారు నాస్తికులు. వారు ఈశ్వరుడిని విశ్వసించనివారు మరియు మనము ఈశ్వరునితో యోగాన్ని జోడించేవారము. అభిప్రాయ-భేదాలు ఏర్పడతాయి. ఎవరికైతే తండ్రి గురించి తెలియదో వారు నాస్తికులు అని అర్థం చేయించడం జరుగుతుంది. కావున తండ్రియే వచ్చి ఆస్తికులుగా తయారుచేస్తారు. తండ్రికి చెందినవారిగా అవ్వడంతో తండ్రి యొక్క వారసత్వం లభిస్తుంది. ఇవి చాలా గుహ్యమైన విషయాలు. మొట్టమొదట గీతా భగవంతుడు పరమపిత పరమాత్మ అన్నది వారి బుద్ధిలో కూర్చోబెట్టాలి. వారే ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేసారు.

భారత్ యొక్క దేవీ-దేవతా ధర్మమే ముఖ్యమైనది. భారతఖండానికి ఏదైనా ధర్మమైతే ఉండాలి కదా. వారు తమ ధర్మాన్ని మర్చిపోయారు. డ్రామానుసారంగా భారతవాసులు తమ ధర్మాన్ని మర్చిపోవాలి అని కూడా మీకు తెలుసు, అప్పుడే కదా తండ్రి మళ్ళీ వచ్చి స్థాపన చేస్తారు. లేదంటే మరి తండ్రి ఎలా వస్తారు? ఎప్పుడెప్పుడైతే దేవీ-దేవతా ధర్మం కనుమరుగైపోతుందో, అప్పుడు నేను వస్తాను అని వారు అంటారు. తప్పకుండా కనుమరుగవ్వాలి. ఎద్దుకు ఒక కాలు విరిగిపోయింది, మిగిలిన మూడు కాళ్ళపై నిలబడి ఉంది అని అంటారు కదా. కావున ముఖ్యమైనవి నాలుగు ధర్మాలు. ఇప్పుడు దేవతా ధర్మం యొక్క కాలు విరిగిపోయింది అనగా ఆ ధర్మం మాయమైపోయింది, కావుననే దీని పునాది కుళ్ళిపోయింది అని మర్రి వృక్షపు ఉదాహరణను ఇస్తారు. మిగిలిన శాఖోపశాఖలు ఎన్ని నిలబడి ఉన్నాయి. కావున ఇందులో కూడా పునాది అయిన దేవీ-దేవతా ధర్మము లేనే లేదు. ఇకపోతే మొత్తం ప్రపంచంలో మతాలు-మార్గాలు మొదలైనవి ఎన్ని ఉన్నాయి! మీ బుద్ధిలో ఇప్పుడు మొత్తం ప్రకాశమంతా ఉంది. తండ్రి అంటారు, పిల్లలైన మీరు ఈ డ్రామా గురించి తెలుసుకున్నారు. ఇప్పుడు ఈ పూర్తి వృక్షమంతా పాతబడిపోయింది. కలియుగం తర్వాత సత్యయుగం తప్పకుండా వస్తుంది. చక్రము తప్పకుండా తిరగాలి. ఇప్పుడిక నాటకం పూర్తయింది, మేము వెళ్తున్నాము - అని బుద్ధిలో ఉంచుకోవాలి. నడుస్తూ-తిరుగుతూ, లేస్తూ-కూర్చుంటూ కూడా స్మృతిలో ఉండాలి - ఇప్పుడు మేము తిరిగి వెళ్ళాలి అని. మన్మనాభవ, మధ్యాజీభవ యొక్క అర్థం ఇదే. ఎవరైనా పెద్ద సభలో భాషణ మొదలైనవి చేయాలనుకుంటే ఇదే అర్థం చేయించాలి - పరమపిత పరమాత్మ మళ్ళీ చెప్తున్నారు, ఓ పిల్లలూ, దేహ సహితంగా దేహపు సర్వ ధర్మాలను త్యజించి స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేసినట్లయితే మీ పాపాలు సమాప్తమవుతాయి. నేను మీకు రాజయోగాన్ని నేర్పిస్తాను. గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమలపుష్ప సమానంగా అయి నన్ను స్మృతి చేయండి, పవిత్రంగా ఉండండి, జ్ఞానాన్ని ధారణ చేయండి. ఇప్పుడు అందరూ దుర్గతిలో ఉన్నారు. సత్యయుగంలో దేవతలు సద్గతిలో ఉండేవారు. మళ్ళీ తండ్రే వచ్చి సద్గతిని ఇస్తారు. సర్వగుణ సంపన్నులుగా, 16 కళల సంపూర్ణులుగా అవ్వడము... ఇవి సద్గతి యొక్క లక్షణాలు. వీటిని ఎవరు ఇస్తారు? తండ్రి. మరి వారి లక్షణాలేమిటి? వారు జ్ఞానసాగరుడు, ఆనందసాగరుడు. వారి మహిమ పూర్తిగా వేరు. అందరూ ఒక్కరే అని కాదు. ఆత్మలందరూ ఒక్క తండ్రి పిల్లలు. వీరు ప్రజాపితకు కూడా సంతానం అవుతారు. ఇప్పుడు కొత్త రచన రచించడం జరుగుతోంది. ప్రజాపితకైతే అందరూ సంతానమే కానీ వారికి ఈ విషయాల గురించి తెలియదు. బ్రాహ్మణ వర్ణము అన్నింటికంటే ఉన్నతమైనది. భారత్ యొక్క వర్ణాలే గాయనం చేయబడతాయి. 84 జన్మలు తీసుకునేటప్పుడు ఈ వర్ణాలను దాటి వెళ్ళవలసి ఉంటుంది. బ్రాహ్మణ వర్ణము సంగమయుగంలోనే ఉంది.

పిల్లలైన మీరు ఇప్పుడు స్వీట్ సైలెన్స్ లో ఉంటారు. ఈ సైలెన్స్ అన్నింటికన్నా మంచిది. నిజానికి శాంతి అనే హారము మీ మెడలోనే ఉంది. శాంతి ఉండే ఇంటికి వెళ్ళాలని అందరూ కోరుకుంటారు. కానీ ఈ మార్గాన్ని ఎవరు తెలియజేయాలి? శాంతిసాగరుడు తప్ప ఇంకెవ్వరూ తెలియజేయలేరు. శాంతిసాగరుడు, జ్ఞానసాగరుడు అని మంచి టైటిల్స్ ను ఇచ్చారు. శ్రీకృష్ణుడైతే స్వర్గానికి యువరాజు. బాబా మనుష్య సృష్టికి బీజరూపుడు. ఎంతగా రాత్రికి-పగలుకు ఉన్నంత తేడా ఉంది. కృష్ణుడిని సృష్టికి బీజము అని అనలేరు. సర్వవ్యాపి జ్ఞానం నిలవదు. తండ్రికి తమ మహిమ ఉంది. వారు సదా పూజ్యులు, ఎప్పుడూ పూజారిగా అవ్వరు. పై నుండి మొట్టమొదట ఎవరైతే వస్తారో వారు పూజ్యుల నుండి పూజారులుగా అవుతారు. పాయింట్లు అయితే ఎన్నో అర్థం చేయించడం జరుగుతుంది. ప్రదర్శినీలకు ఎంతమంది వస్తారు, కానీ కోట్లల్లో కొద్దిమందే వెలువడుతారు ఎందుకంటే గమ్యము చాలా ఉన్నతమైనది. ప్రజలైతే ఎంతోమంది తయారవుతూ ఉంటారు. మాలలోకి వచ్చేటువంటి మణులు కోట్లల్లో కొద్దిమందే వెలువడుతారు. నారదుని ఉదాహరణ కూడా ఉంది, నీవు లక్ష్మిని వరించేందుకు యోగ్యంగా ఉన్నావా? నీ ముఖాన్ని చూసుకో అని అతనితో అన్నారు. ప్రజలైతే ఎంతోమంది తయారవ్వనున్నారు. ఎంతైనా రాజు రాజే. ఒక్కొక్క రాజుకు లక్షలాది మంది ప్రజలు ఉంటారు. పురుషార్థమైతే ఉన్నతముగా చేయాలి. రాజులలో కూడా కొందరు పెద్ద రాజులు, కొందరు చిన్న రాజులు ఉంటారు. భారత్ లో ఎంతమంది రాజులు ఉండేవారు! సత్యయుగంలో కూడా చాలామంది మహారాజులు ఉంటారు. ఇలా సత్యయుగం నుండి కొనసాగుతూ వచ్చింది. మహారాజులకు ఎంతో ఆస్తి ఉంటుంది, రాజులకు తక్కువ ఉంటుంది. ఇది శ్రీ లక్ష్మీ-నారాయణులుగా తయారయ్యే జ్ఞానము. దీని కొరకే పురుషార్థము నడుస్తూ ఉంటుంది. లక్ష్మీ-నారాయణుల పదవిని పొందుతారా లేక సీతా-రాముల పదవినా అని అడిగితే, మేమైతే లక్ష్మీ-నారాయణుల పదవినే పొందుతాము, తల్లి-తండ్రుల నుండి పూర్తి వారసత్వాన్ని తీసుకుంటాము అని అంటారు. ఇవి అద్భుతమైన విషయాలు కదా, ఇంకెక్కడా ఈ విషయాలు లేవు, ఏ శాస్త్రాలలోనూ లేవు. ఇప్పుడు మీ బుద్ధి తాళం తెరుచుకుంది. తండ్రి అర్థం చేయిస్తారు, నడుస్తూ-తిరుగుతూ - మేము పాత్రధారులము, ఇప్పుడిక మేము తిరిగి వెళ్ళాలి అని ఈ విధంగా భావించండి. దీనినే మన్మనాభవ, మధ్యాజీభవ అని అంటారని గుర్తుంచుకోండి. నేను మిమ్మల్ని తిరిగి

తీసుకువెళ్ళేందుకు వచ్చాను అని - తండ్రి ఘడియ-ఘడియ స్మృతిని ఇప్పిస్తారు. ఇది ఆత్మిక యాత్ర. ఈ యాత్రను తండ్రి తప్ప ఇంకెవ్వరూ చేయించలేరు. భారత్ యొక్క మహిమను కూడా ఎంతగానో చేయాలి. ఈ భారత్ అత్యంత పవిత్రమైన భూమి. సర్వుల దుఃఖహర్త మరియు సుఖకర్త, సర్వుల సద్గతిదాత ఒక్క తండ్రియే. భారత్ వారి జన్మస్థానము. ఆ తండ్రి సర్వుల ముక్తిప్రదాత. వారిది ఇక్కడ (భారత్ లో) ఉన్నతోన్నతమైన తీర్థస్థానము ఉంది. భారతవాసులు శివుని మందిరాలకు వెళ్తారు కానీ వారికి వీరి గురించి తెలియదు. గాంధీ గురించి తెలుసు, వారు చాలా మంచివారని భావిస్తారు, కావుననే వారి వద్దకు వెళ్ళి పుష్పాలు మొదలైనవి చల్లుతారు, లక్షలు ఖర్చు చేస్తారు. ఇప్పుడు ఈ సమయంలో ఉన్నది వారి రాజ్యమే. ఏది కావాలనుకుంటే అది చేయగలరు. ఇక్కడైతే తండ్రి కూర్చొని గుప్త ధర్మాన్ని స్థాపన చేస్తారు, ఈ రాజ్యమే వేరు. భారత్ లో మొట్టమొదట దేవతల రాజ్యం ఉండేది. అసురులకు మరియు దేవతలకు యుద్ధము జరిగినట్లుగా చూపిస్తారు. కానీ ఇటువంటి విషయాలేవీ లేవు. ఇక్కడైతే యుద్ధ మైదానంలో మాయపై విజయాన్ని పొందడం జరుగుతుంది, మాయపై విజయాన్ని అయితే తప్పకుండా సర్వశక్తివంతుడే ప్రాప్తింపజేస్తారు. బాబాయే రావణ రాజ్యం నుండి విడిపించి రామ రాజ్య స్థాపనను చేయిస్తారు. ఇకపోతే అక్కడ యుద్ధాలు మొదలైన విషయాలేవీ ఉండవు. ఇప్పుడు చూసినట్లయితే సృష్టిలో ఈ సమయంలో క్రిస్టియన్లు సర్వశక్తివంతులుగా ఉన్నారు. వారు కావాలనుకుంటే అందరిపై విజయాన్ని పొందగలరు, కానీ వారు విశ్వాధిపతులుగా అవ్వడమనేది నియమము కాదు. ఈ రహస్యము గురించి మీకే తెలుసు. ఈ సమయంలో సర్వశక్తివంతమైన రాజధాని క్రిస్టియన్లది. లేకుంటే వారి సంఖ్య తక్కువ ఉండాలి, ఎందుకంటే వారు చివరిలో వచ్చారు. కానీ మూడు ధర్మాలలోనూ ఈ ధర్మం చాలా చురుకైనది. అందరినీ చేజిక్కించుకుని ఉన్నారు. ఇది కూడా డ్రామా తయారై ఉంది. వీరి ద్వారానే మళ్ళీ మనకు రాజధాని లభించనున్నది. రెండు పిల్లులు కొట్లాడుకుంటే, వెన్న మధ్యలో మూడవవారికి లభించినట్లుగా కథ కూడా ఉంది. కావున వారు పరస్పరం కొట్లాడుకుంటారు, వెన్న మధ్యలో భారతవాసులకే లభించనున్నది. కథ అయితే సాధారణమైనదే, దాని అర్థం ఎంత గొప్పది. మనుష్యులు ఎంత వివేకహీనులుగా ఉన్నారు. పాత్రధారులుగా ఉంటూ కూడా డ్రామా గురించి తెలియదు, వివేకహీనులుగా అయిపోయారు. పేదవారే అర్థం చేసుకుంటారు. షావుకారులు ఏమీ అర్థం చేసుకోరు. పేదల పెన్నిధి, పతిత-పావనుడు అని తండ్రి మహిమ చేయబడ్డారు. ఇప్పుడు వారు ప్రాక్టికల్ గా పాత్రను అభినయిస్తున్నారు. పెద్ద-పెద్ద సభలలో మీరు అర్థం చేయించాలి. మెల్ల-మెల్లగా వాహ్-వాహ్ అనేది వెలువడుతుంది, చివరి సమయంలో ఢంకా మ్రోగనున్నది అని వివేకము చెప్తుంది. ఇప్పుడైతే పిల్లలపై గ్రహచారం కూర్చుంటుంది. లైన్ క్లియర్ గా లేదు. విఘ్నాలు కలుగుతూ ఉంటాయి. అవి కూడా డ్రామానుసారంగా కలుగుతూ ఉంటాయి. ఎంతగా పురుషార్థం చేస్తారో, అంత ఉన్నత పదవిని పొందుతారు. పాండవులకు మూడు అడుగుల భూమి కూడా లభించేది కాదు. అది ఇప్పటి గాయనమే. కానీ వారే మళ్ళీ ప్రాక్టికల్ గా విశ్వాధిపతులుగా అవుతారని ఎవ్వరికీ తెలియదు. ఇందులో బాధపడేది ఏమీ లేదని పిల్లలైన మీకు ఇప్పుడు తెలుసు. కల్పక్రితము కూడా ఈ విధంగానే జరిగింది. డ్రామా పట్టాలపై నిలబడి ఉండాలి, చలించకూడదు. ఇప్పుడు నాటకం పూర్తవుతుంది, సుఖధామానికి వెళ్తారు. చదువును ఎలా చదవాలంటే, దాని ద్వారా ఉన్నత పదవిని పొందాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. నడుస్తూ-తిరుగుతూ స్వయాన్ని పాత్రధారిగా భావించాలి, డ్రామా పట్టాలపై స్థిరంగా ఉండాలి. ఇప్పుడు మేము తిరిగి ఇంటికి వెళ్తున్నాము, మేము యాత్రలో ఉన్నాము అని బుద్ధిలో ఉండాలి.

2. సద్గతి యొక్క సర్వ లక్షణాలను స్వయంలో ధారణ చేయాలి. సర్వగుణ సంపన్నులుగా, 16 కళల సంపూర్ణులుగా అవ్వాలి.

వరదానము:- సంగమయుగంలో శ్రేష్ఠ మతము ద్వారా శ్రేష్ఠ గతిని ప్రాప్తి చేసుకునే ప్రత్యక్ష ఫలానికి అధికారీ భవ

సంగమయుగంలో శ్రేష్ఠ మతము ఆధారముగా ఏవైతే శ్రేష్ఠ కర్మలు చేస్తారో వాటికి ప్రత్యక్షఫలము అనగా సఫలత ఇప్పుడే ప్రాప్తిస్తుంది, అందుకే - ఎటువంటి మతమో అటువంటి గతి అని అంటారు. వారు మరణించిన తరువాత గతి లభిస్తుంది అని భావిస్తారు, కానీ పిల్లలైన మీకు ఈ అంతిమ మరజీవా జన్మలో ప్రతి కర్మకు సఫలతా ఫలము ప్రాప్తించే అనగా గతి ప్రాప్తించే వరదానము లభించి ఉంది. మీరు

భవిష్యత్తు కోసం ఎదురుచూడరు. ఇప్పుడిప్పుడే చేస్తారు మరియు ఇప్పుడిప్పుడే ప్రాప్తి యొక్క అధికారము లభిస్తుంది - దీనినే రచయితకు రచనపై ఉన్న సత్యమైన ప్రేమ అని అంటారు.

స్లోగన్:- దృఢ సంకల్పంతో ప్రతి అడుగులోనూ తండ్రిని ఫాలో చేసేవారే సంపన్నంగా అవుతారు.